క్లుప్తంగా

శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శం



అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే

మార్కాపురం టౌన్: శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శమని.. శ్రీరామనవమి పండుగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కోరారు. ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు, అధికారులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలుకే

మార్కాపురం టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని టూటౌన్ ఎస్సై డాక్టర్ సీహెచ్ రాజమోహన్ రావు హెచ్చరించారు. శనివారం ఉదయం పట్టణ శివార్లలో పలువురు బహిరంగంగా మద్యం తాగుతుండగా వారిని అదుపులోనికి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగంగా మద్యం తాగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని, రోడ్డుపై వెళ్లేవారిని ఇబ్బందిపెట్టినా కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

నేడు శ్రీరాముడి శోభాయాత్ర

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని పాతబద్వేల్ రోడ్డులో గల సీతారామస్వామి ఆలయం వద్ద నుంచి ఆదివారం ఉదయం 7.30 గంటలకు శ్రీరామ శోభాయాత్ర బైక్ పై నిర్వహిస్తారని గిద్దలూరు నియోజకవర్గం దేవాలయాల కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి యర్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వహిందూ పరిషత్, దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభాయాత్ర కొనసాగుతుందని కావున ప్రతి హిందువు యాత్రలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా చెన్నకేశవుని శాంతి కల్యాణం



మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవీ భూదేవీ సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామికి శాంతి కల్యాణం శనివారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. కంభం రోడ్డులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామివారి, వెంకటేశ్వరస్వామి మూల విరాట్‌లకు అభిషేకాలు, తోమాల సేవ చేశారు. భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించి విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి

గిద్దలూరు రూరల్: ఈ నెల 30వ తేదిలోపు నగర పంచాయతీలోని ఇంటి పన్ను, ఖాళీస్థలాల పన్ను ఇతర ఆస్తిపన్నులను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నగర పంచాయతీలోని ఆస్తి పన్ను చెల్లింపు దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సకాలంలో పన్నులను చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



కంభంలో నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు



జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు



గిద్దలూరులో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్



మార్కాపురంలో జగజ్జీవన్‌రామ్‌కు ఎస్టీయూ నాయకులు



బేస్తవారిపటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్



మార్కాపురంలో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సుబ్బారావు



కొనకనమిట్లలో.. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

- ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

బేస్తవారిపేట:

జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు, అణగారిన వర్గాల ఆశాదీపం, విశిష్ట పార్లమెంటేరియన్, నిజమైన ప్రజాస్వామ్యవాది, విశిష్ట కేంద్ర మంత్రి, సమర్థ పరిపాలనాదక్షుడు, అసాధారణ ప్రతిభావంతుడైన వక్త, మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బేస్తవారిపేట మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, గ్రంథాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎనలేని సేవలను అందించారని, సుదీర్ఘకాలం పార్లమెంట్ మెంబర్‌గా ఉండి ఎన్నో పదవులను చేపట్టారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో డీటీ షేక్ సలీమ్‌బాషా, ఆర్ఐ, వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కంభంలో..

కంభం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు, జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్, శ్యామ్, భాస్కర్, పోలయ్య, రామయ్య, బాబ్జి, శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ హాస్టల్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాచర్ల డీటీ వెంకటేశ్వర్లు, చాట్లజాన్, రమేష్‌బాబు, ముజీబ్, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో

మార్కాపురం: డాక్టర్ శ్యామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ డాక్టర్ ఎం మస్తానయ్య, జగ్జీవన్‌రామ్ జయంతి చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆదమూలపు సురేష్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యుదయానికి అలుపెరుగని కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ మస్తానయ్య, డాక్టర్ పీపీఎస్ నాయక్, ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్‌కుమార్, ఎన్‌సీసీ ఏఎన్ఓ కెప్టెన్ అనీల్, ఏఓ హనుమంతరావు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో..

మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య శాంతివనంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాబు జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో దొనకొండ మండలశాఖ అధ్యక్షుడు చికిరిగాలెయ్య, జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు నూతలపాటి ప్రసాదరావు, మండల ఆర్థిక కార్యదర్శి, మండల ఉపాధ్యక్షుడు కుందురు రామకృష్ణారెడ్డి, ఎస్ రవికుమార్, మీర్జపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన వితరణ..

- స్థానిక గడియార స్తంభం వద్ద ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. సీఐ సుబ్బారావు పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సైదుబాబు, టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ రావు, మహాజన సోషలిస్టు పార్టీ మార్కాపురం ఇన్‌ఛార్జి పందీటి కాశీరావు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎనిబెర కిశోర్, తర్లుపాడు మండల అధ్యక్షులు తంగిరాల బాబు, ఎంఈఎఫ్ నాయకులు చార్లెస్, నాయకులు నిశనం పాపయ్య, బూదాల ప్రదీప్, బాల చెన్నయ్య, నాయకులు కవలకుంట్ల నాగేంద్ర, కొడవటికంటి దాసు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు. జార్జి ఫార్మసీ కళాశాలలో బాబూ జగజ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై రాజా జయరావు, డీన్ డాక్టర్ వై సునీత, హెచ్‌వోడీలు డాక్టర్ కె అశోక్‌బాబు, భాస్కర్‌బాబు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా ఎంతో శ్రమించి గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లొక్కు రమేష్, మాజీ కౌన్సిలర్ శ్రీను, సీనియర్ అసిస్టెంట్ టపావలి, తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్లలో

కొనకనమిట్ల: మండల కేంద్రంలో కొనకనమిట్లలోని గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో ఎస్సీ నాయకులు పిల్లి బాలనరసయ్య అధ్యక్షతన జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు బూదాల కమలాకర్, మంచికల కోటేశ్వరరావు, పందిటి ఏసేబు, పిచ్చయ్య, కొండయ్య, ఏ.శ్రీను, డేవిడ్, యోబు, వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే పంట నూర్పిడులు



నూర్పిడి కోసం రోడ్డుపై వేసిన కంది కట్టె

- వాహనాల టైర్లే నూర్పిడి యంత్రాలు
- ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని వివిధ గ్రామాల్లో కంది, ఆముదం, సజ్జ, జొన్న తదితర పంటల నూర్పిళ్లు చేస్తున్నారు. సజ్జ, కంది, వరిగె, కొర్రలను సాగు చేసిన రైతులు పంట నూర్పిడిలను రహదారులపై చేస్తున్నారు. దీంతో వాహనాల డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమ సాధారణంగా ఈ కోతలను పంట నూర్పిడి యంత్రాల ద్వారా తమ పొలాల్లో రైతులు చేపట్టాలి. ఈ విధానానికి ఖర్చు ఎక్కువగా ఉంటుండటంతో రైతులు తారు రోడ్లను పంట నూర్పిడిలకు ఉపయోగించుకుంటున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంటలు కోతలకు వచ్చాయి. పంటల నూర్పిడిలను రైతులు చేస్తున్నారు. మార్కాపురం నుంచి కంభం, బేస్తవారిపేట నుంచి గిద్దలూరు, మార్కాపురం నుంచి దోర్నాల, త్రిపురాంతకం రాష్ట్ర, జాతీయ రహదారులపై రైతులు తాము పండించిన ఉత్పత్తులను రోడ్లపై పోసి నూర్పిడి చేస్తున్నారు. దీని వలన ద్విచక్ర వాహనదారులు కింద పడటం, బండి పంక్చర్లు అవుతున్నాయి. ఫిబ్రవరి నుంచి మార్చి నెలాఖరు వరకు రోడ్లపై పంట నూర్పిడిలను చేస్తుంటారు. వాహనాల టైర్ల క్రింద కంది, వరి పంటలు నూర్పిడి జరిగి సాయంత్రం గింజలు వస్తున్నాయి. ఈ విధానం వలన రైతులు ఎక్కువగా నష్టపోతున్న పట్టించుకోవటం లేదు. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వరి, జొన్న, రాగి గింజలు నలిగి పోతున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే వినియోగదారులు, వ్యాపారులు ఇష్టపడటం లేదు. ఇప్పటికైనా రైతులు పంట నూర్పిడిలను ఆధునిక యంత్రాలతో తమ పొలంలో చేసుకోవాలని వ్యవసాయాధికారులు, వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు పైన పంట నూర్పిడులు చేయడం వలన ద్విచక్ర వాహనాల టైర్లు జారి వాహనదారులు కింద పడుతున్నారు. నూర్పిడుల సమయంలో దుమ్ము, ధూళి కళ్లలో పడుతూ అవస్థలు పడుతున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి..

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమో నమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు లక్ష్మీ అలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకలు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకట రామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు



అలంకరణలో సీతారాములు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నుంచి మూడు రోజులపాటు శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, నాయుడుపేట, చినమనగుండం, పెదారికట్ల, చినారికట్ల, వాగుమడుగు, సలనూతల, రేగడపల్లి, వింజవర్తిపాడు, మునగపాడు గ్రామాల్లో ఇప్పటికే రాములవారి ఆలయాలను ముస్తాబు చేశారు. గొట్లగట్టు గ్రామంలో సీతారాముల వారి దేవస్థానం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం పానకపు బండ్లు, రాత్రికి గరుడోత్సవం రాములోరి ఊరేగింపు, రాత్రికి చెంచులక్ష్మి పౌరాణిక నాటకం, సోమవారం 12 గంటలకు అన్న సంతర్పన కార్యక్రమం, రాత్రికి హనుమంతోత్సవ కార్యక్రమం, మంగళవారం సాయంత్రం రథోత్సవం, వసంతోత్సవం, మహిళల కోలాటం ఉంటుంది. రాత్రికి అద్దంకి వారిచే భక్త చింతామణి పౌరాణిక నాటకం ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



ర్యాలీలో పాల్గొన్న సంఘు నాయకులు

కొమరోలు: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కొమరోలు మండలంలోని క్రైస్తవ సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమరోలులోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి సంఘ నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చాలా బాధాకరమని, ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ కేసును తప్పుదోవ పట్టకుండా సమగ్ర విచారణ చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు రోషన్‌కుమార్, సతీష్, పల్లె బాబు, పాస్టర్లు జాన్, దస్తగిరి, ఏసుదాసు, విజయ్‌శేఖర్, యహోశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాలు

కంభం: స్థానిక కందులాపురం కూడలిలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలంలో ఉన్న వైస్సార్‌సీపీ జెండాతో పాటు, పలు ప్రజాసంఘాల జెండాలను గతనెల 12వ తేదీన హైవే అధికారులు పోలీసుల సహకారంతో తొలగించిన విషయం విధితమే. ఈనేపథ్యంలో శనివారం సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు వారికి సంబంధించిన జెండాను తొలగించిన స్థానంలోనే ఏర్పాటు చేసుకొని ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సై నరసింహారావు హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి జెండా ఆవిష్కరించుకోడానికి అనుమతులు ఇప్పించారన్నారు. అనుమతులు ఇప్పించిన ఎస్సైకి ప్రజాసంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్, రోశయ్య, ఖాజావలి, కొత్తూరు, జెర్మియా, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు సిద్దారెడ్డి, హుస్సేన్, నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శిఖర కలశ ప్రతిష్ఠ

కొనకనమిట్ల: జై శ్రీరామ్ అంటూ మండలంలోని గొట్లగట్టు గ్రామంలో పట్టాభిరామస్వామి ఆలయంపైన కలశ శిఖరాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. గతంలో ఉన్న కలశ శిఖరం పాడవటంతో గ్రామ పెద్దల పర్యవేక్షణలో దాతల సహకారంతో నూతన కలశ శిఖరాన్ని వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రతిష్టించారు. అలాగే పట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీరాముల వారి మూల విరాట్‌కు సంబంధించిన మకర తోరణాన్ని పేర్ల వెంకటసుబ్బయ్య కుమారులు సుమారు రూ.70 వేలతో తయారు చేయించారు.



కలశాన్ని ప్రతితిష్ఠిస్తున్న వేదపండితులు